# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో **(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
& **చైతన్య గళం** ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 300 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | సోమవారం | 9-12 -2024 | వెల : .రూ. 5.00




# నేటి నుంచి అసెంబ్లీ

ఒక్కరోజే..మళ్ళీ 16 నుంచి కొనసాగింపు

-హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, యూపీఏ చైర్‌పర్సన్‌గా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు ధన్యవాద

-మిగతా 2 లో



# ఎయిర్ షో.. అదరహో

- ఆకట్టుకున్న వాయుసేన విన్యాసాలు
- స్వయంగా వీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- కట్టిపడేసిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు
- ఉర్రూతలూగించిన బతుకమ్మ పాటలు..కోలాటాలు
- ట్యాంక్‌బండ్‌పై సండే సందడే సందడి
- వైభవంగా ప్రజాపాలన ఏడాది విజయోత్సవాల వేడుకలు

రాహుల్ సిప్లిగంజ్ ధూంధాం



డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) -హైదరాబాద్

ఇసుకేస్తే రాలనంత జనంతో ఆదివారం సంధ్యాసమయంలో ట్యాంక్‌బండ్ కిటకిటలాడిపోయింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా ఇండియన్ ఫోర్స్ ఆధ్వర్యంలో అజరు నేతృత్వంలో 9 సూర్యకిరణ్ విమానాలతో నిర్వహించిన ఎయిర్‌షో అదరహో -మిగతా 2 లో



## కొత్త రెవెన్యూ చట్టంపై
# అసెంబ్లీలో బిల్లు

- ధరణి కోసం కొత్త యాప్
- ఈనెల ఒకటి నుంచి ఎన్ఐసీకి పోర్టల్ నిర్వహణ బాధ్యతలు
- గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం
- రోల్ మోడల్‌గా ఆర్వోఆర్ చట్టం
- విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్‌డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )

సోమవారం నుంచి నిర్వహించబోయే శాసనసభ సమావేశాల్లో కొత్త రెవెన్యూ చట్టం బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. -మిగతా 2 లో



# ఏడాది పాలనంతా ఎడతెగని వంచనే

- -ప్రజాస్వామ్యం అపహాస్యం
- -భావప్రకటనా స్వేచ్ఛకు భంగం
- - నిరసన తెలిపే హక్కే లేకుండా పోయింది
- బీఆర్ఎస్ చార్జిషీట్‌ను విడుదల చేసిన హరీశ్‌రావు

హైదరాబాద్

రేవంత్ సర్కార్ ఏడాది పాలనంతా ఎడతెగని వంచనేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

-మిగతా 2 లో



# సిరియా దేశం లో తిరుగుబాటు

- దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు అసద్
- అధికారం మాదేనన్న తిరుగుబాటుదారులు
- తాజా పరిణామంపై మిశ్రమ స్పందన

దమాస్కస్‌డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )

సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పదవీచ్యుతులయ్యారు. అమెరికా మద్దతు కలిగిన సిరియన్ ఫ్రీ ఆర్మీ' దళాల తిరుగుబాటుదారులు ఆదివారం

-మిగతా 2 లో

# తెలంగాణ తల్లికి ఘన నీరాజనం




- మెట్రో కారిడార్లు, స్టేషన్లలో ప్రజాపాలన విజయోత్సవాల సంరంభం
- 25 మెట్రో స్టేషన్లలో 'తెలంగాణ తల్లి' చిత్రాల ఏర్పాటు

హైదరాబాద్‌డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )

ప్రజాపాలన- ప్రజా విజయోత్స వాలను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఘనంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి ఎనుముల -మిగతా 2 లో



# రైతులపై మళ్లీ జులుం

- శంభు సరిహద్దులో బాష్పవాయుగోళాల ప్రయోగం
- ఢిల్లీ సరిహద్దులో ముండ్ల కంచెలు, రోడ్లపై మేకులు, ఇనుప బారికేడ్లు
- యూపీ జైళ్లలోనే రైతుల నిరాహార దీక్ష
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

న్యూఢిల్లీడిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )

కేంద్రం చర్చలకు సిద్ధపడకపోవడంతో తిరిగి ప్రారంభించిన పంజాబ్ రైతుల ఢిల్లీ మార్చ్‌ను హర్యానా పోలీసులు శంభు సరిహద్దు వద్ద మరోసారి అడ్డుకున్నారు. ఫిబ్రవరి నుంచి కాంక్రీట్ కంచె వేసి, కేంద్ర బలగాలను మోహరించి రైతులను అడ్డుకుంటూనే ఉన్నారు. ఇప్పుడు కూడా అదే యుద్ధ వాతావరణం కనిపించింది. ఢిల్లీ సరిహద్దుల్లో ముండ్లకంచెలు, ఇనుప బారికేడ్లతో దారులు మూసేశారు. దీంతో రైతులు తమ పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. తదుపరి

-మిగతా 2 లో

# తెలంగాణ తల్లి విగ్రహం మార్పు మూర్ఖత్వం



- కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఆధారంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ఎల్పీ భేటీ
- అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం
- హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- కాంగ్రెస్ ఏడాది పాలనపై హరీశ్‌రావు, కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్‌డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా నిలదీయాలని మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలను వారికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ఆధారంగా వైఫల్యాలను ఎండగట్టాలని తెలిపారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి.. పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చటం -మిగతా 2 లో

# ఎయిర్ షో.. అదరహో

(మొదటి తరువాయి)

అనిపించింది. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద వాయుసేన విన్యాసాల కార్యక్రమాన్ని, భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డు వద్ద ఉన్న హెచ్ఎండీఏ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ట్యాంక్‌బండ్‌పై వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సందర్శించారు.

పిల్లాపాపలు..చిన్నాపెద్దా..అనే తేడా లేకుండా వైమానిక దళాలు ప్రదర్శించిన విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. విమానాలు తమ సమీపానికి వచ్చిన ప్రతిసారీ కేరింతలు కొడుతూ ఎంజారు చేశారు. తమ సెల్‌ఫోన్లలో బంధించారు. వాయుసేన విమానాల ప్రదర్శనతో వీక్షకులు కుటుంబ సమేతంగా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. ఎయిర్‌షోలో విమానాలు 360 డిగ్రీల కోణంలో తిరగడం, ఫల్టీలు కొట్టడం, ఒకదానినొకటి క్రాస్ చేసుకోవడం, త్రివర్ణ పతాకాన్ని సూచించేలా మూడు రంగుల పొగను ఒక స్వీకెన్స్‌లో విడుదల చేయడం, లవ్ సింబల్, దాని మధ్యలో బాణం గుర్తును గీయడం లాంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. 'మా ప్రదర్శనలూ వీక్షించండి' అన్నట్టుగా ఎయిర్‌షో జరుగుతున్న క్రమంలోనే పక్షులు కూడా గుంపులుగా ట్యాంక్‌బండ్‌పై చక్కర్లు కొట్టడం వీక్షకులను కట్టిపడేసింది. ఎయిర్‌షోను, రాహుల్ సిప్లిగంజ్ పాటలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, ఆయా శాఖల ఉన్నతాధికారులు ట్యాంక్‌బండ్, ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ వేదికల నుంచి వీక్షించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు సమాచార శాఖ కమిషనర్ హరీశ్ స్వాగతం పలికారు.

# కొత్త రెవెన్యూ చట్టంపై అసెంబ్లీలో బిల్లు

(మొదటి తరువాయి)

ఒక వైపు ధరణి పోర్టల్ ప్రక్షాళనకు అవసరమైన చర్యలు చేపడుతూనే మరోవైపు దానికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఇంకోవైపు కొత్త రెవెన్యూ చట్ట రూపకల్పనకు శ్రీకారం చుట్టి కొలిక్కి తీసుకొచ్చామని చెప్పారు. సీఎం రేవంత్ నాయకత్వంలో ఏడాది కాలంగా పలు నిర్ణయాలు తీసుకుని, రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. తద్వారా ఆ విభాగంలో గణనీయనమైన ప్రగతిని సాధించామని వివరించారు. ప్రజాపాలన-విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాలు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికపై పొంగులేటి మాట్లాడారు. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతల నుంచి టెర్రాసిస్ అనే విదేశీ సంస్థను తప్పించి, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్.ఐ.సీకి వాటిని అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈనెల ఒకటి నుంచి ఎన్.ఐ.సీ ఆ బాధ్యతలను చూస్తోందని చెప్పారు. ధరణి పోర్టల్ కారణంగా రైతులు గతంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తరతరాలుగా తమ యజమాన్యంలో ఉన్న భూములపై వారు సర్వ హక్కులూ కోల్పోయారని చెప్పారు. భూముల వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేసే సమయంలో జరిగిన లోపాలు, అక్రమాలు, అవకతవకల వల్ల లక్షలాది మంది రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని వాపోయారు. రైతులు తమ భూములను అమ్ముకోవడానికి గాని, ఆ భూములపై బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి గాని అనేక కష్టాలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యులకు రెవెన్యూ సేవలు అందేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా ధరణి సమస్యలపై సమీక్షించి వాటి పరిష్కారానికి మార్గాలను చూపించేందుకు భూ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రీకృతమై ఉన్న అధికారాలను వికేంద్రీకరించి, మండల స్థాయిలో తహశీల్దార్‌కు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్లకు సమస్యలను అధికారాన్ని అప్పగించామని వివరించారు. ఒక్కప్పుడు ధరణిలో ఏ ఎంట్రీ మారినా, ఎందుకు మారిందో తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లో కానీ, కాగితాలపైగానీ ఎలాంటి ఆధారం ఉండేది కాదన్నారు. కానీ, ఇప్పుడు ఈ విధానాన్ని మార్చి ధరఖాస్తు వచ్చినప్పటి నుండి సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రతీదాన్ని కంప్యూటర్‌లో ఉంచి ఎవరైనా, ఎప్పుడైనా చూసుకునేలా చేశామని వివరించారు. గత ప్రభుత్వంలో ఏ కారణం చెప్పకుండానే దరఖాస్తులను తిరస్కరించే వారనీ, కానీ ఇప్పుడు దరఖాస్తు తిరస్కరించాల్సి వస్తే తిరస్కరణకు గల కారణాలు వివరిస్తూ నివేదికను తప్పనిసరి చేశామని పొంగులేటి చెప్పుకొచ్చారు.

# నేటి నుంచి అసెంబ్లీ

(మొదటి తరువాయి)

తీర్మానంపై చర్చించి, సంతాప తీర్మానాల అనంతరం సభను మళ్ళీ ఈనెల 16వ తేదీకి వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. సోమవారమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మెన్లతో పాటు మంత్రులంతా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దాదాపు లక్షమంది మహిళలను తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే అన్ని జిల్లాల కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు టార్గెట్లు విధించినట్టు సమాచారం. దీనితో ఆదివారం నుంచే సచివాలయం, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో జనసమ్మర్థం పెరిగింది. ఇక్కడ నిర్వహించిన వాయుసేన విమాన విన్యాసాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో అట్టహాసంగా నిర్వహించిన ప్రజాపాలన వార్షికోత్సవ వేడుకల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులంతా బిజీగా ఉన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు జనసమీకరణ సహా అనేక బాధ్యతలు వారిపై ఉన్నాయనీ, అందువల్ల సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించి, వారం తర్వాత తిరిగి కొనసాగించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం అసెంబ్లీ కార్యాలయంలో సమావేశమై నిర్ణయించినట్టు సమాచారం. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు రాతపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలని స్పీకర్ ప్రసాదరావు ఆదేశించారు. అయితే ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రభుత్వ యంత్రాంగం మొత్తం తలమునకలై ఉండటంతో ఆ పనులు పూర్తికాలేదని తెలిసింది. ఈ వారం రోజుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలన్నింటికీ రాతపూర్వక సమాధానాలు ఇచ్చాకే, తిరిగి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ వారం రోజుల్లోనే సీఎం సహా కొందరు మంత్రులు ఢిల్లీకి వెళ్లాల్సి ఉందనీ, మంత్రివర్గ విస్తరణతో పాటు కేంద్రం నుంచి రావల్సిన నిధుల విషయంలో అధికారుల్ని కలిసిరావాల్సి ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యుత్ కమిషన్ నివేదికపై కూడా అసెంబ్లీలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో దాన్ని అధ్యయనం చేయాల్సి ఉంది. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని సబ్‌కమిటీ సిఫార్సులనూ పరిశీలించి, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అన్నింటికీ ప్రజాపాలన విజయోత్సవాలే ప్రధాన అవరోధంగా ఉండటం, జిల్లాలు సహా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అంతా అవే పనుల్లో నిమగమై ఉండటంతో అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి, మళ్లీ వారం తర్వాత పూర్తిస్థాయి చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తున్నది. స్పీకర్, మండలి చైర్మెన్ల సంయుక్త సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు.

# తెలంగాణ తల్లి విగ్రహం మార్పు మూర్ఖత్వం

(మొదటి తరువాయి)

మూర?త్వమేననీ, ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ఇవేనా..? ఇలా మార్పులు చేసుకుంటూ పోతే ఎలా..? అని చెప్పారు.

ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలతోపాటు హైడ్రా, లగచర్ల ఘటనలపై కూడా ప్రశ్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, చింతా ప్రభాకర్, సుధీర్ రెడ్డి, అనిల్ జాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాణిక్‌రావు, వివేక్ మందా గౌడ్, బండారు లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సుంకరి రాజు, షేర్ సుభాష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, వంటేరు యాదవ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదనా చారి, మహమూద్ అలీ, రమణ, దేశపతి శ్రీనివాస్, మధుసూదన్ టాటా, వాణి దేవి, రమణరెడ్డి తదితరులున్నారు.

**ప్రజా సమస్యలపై అసెంబ్లీలో పోరాడుతాం : ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్**

ప్రజా సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పి పోరాడుతామనీ, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం దిశా నిర్దేశం చేసిన అనంతరం విలేకరులతో హరీశ్‌రావు, కేటీఆర్ వేర్వేరుగా మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలుకు మొదటి శాసనసభలో చట్టబద్ధత తెస్తామని హామీనిచ్చినా అమలు చేయలేదన్నారు. ఇలాంటి ఎన్నో హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఫార్మాసిటీ పేరుతో లగచర్లలో గిరిజనుల భూములను అక్రమంగా లాక్కొని వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, రైతు భరోసా రెండు పంటలకు ఇవ్వడంలో విఫలమయ్యారని తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం గళం విప్పి పోరాటాలు చేస్తున్నదన్నారు. దళిత బంధు, బీసీ బంధు, గిరిజ బంధు వాటిపై శాసనసభ, శాసన మండలిలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం కలసి రాకపోతే అర్జెంటు మోషన్ ఇచ్చి అయినా.. చర్చలకు పట్టు పడుతామని తెలిపారు.

# సిరియా దేశం లో తిరుగుబాటు

(మొదటి తరువాయి)

ఉదయం రాజధాని డమాస్కస్‌ను ఆక్రమించుకోవడంతో సిరియా తిరుగుబాటుదారుల వశమైంది. అధ్యక్షుడు అసద్ దేశం విడిచి విమానంలో అజ్ఞాత ప్రదేశానికి వెళ్లిపోయారని సీనియర్ సైనిక అధికారి ఒకరు తెలిపారు. దీంతో 24 ఏళ్ల అసద్ పాలనకు తెరపడిందని ఆర్మీ కమాండ్ అధికారులు చెప్పారు. హయత్ తెహ్రీర్ అల్-షామ్ (హెచ్‌టిఎస్), ఫ్రీ సిరియన్ ఆర్మీ (ఎఫ్ఎస్ఎ), ఇతర స్థానిక మిలీషియా గ్రూపులతో కూడిన కూటమి వారం రోజుల తిరుగుబాటులో కీలకమైన నగరాలను ఒకటి తరువాత ఒకటి ఆక్రమిస్తూ చివరి దుర్గమైన డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్ ప్రభుత్వం పతనమైంది. తిరుగుబాటు నాయకుడు అబూ మహ్మద్ అల్ జొలాని నేతృత్వంలోని హయత్ తెహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) ఒక ప్రకటన చేస్తూ 'ఈ రోజుతో ఒక చీకటి శకం ముగిసింది. కొత్త శకానికి నాంది పలుకుతున్నాం' అని పేర్కొంది. సిరియాలో చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలపై రష్యా, ఇరాన్, ఇరాక్ తదితర పశ్చిమాసియా దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయిల్ తదితర దేశాలు దీనిని స్వాగతించాయి. సిరియాలోని డమాస్కస్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ప్రభుత్వ ప్రసార కేంద్రాలతో సహా కీలకమైన కేంద్రాలను వశపరచుకున్న తర్వాత తిరుగుబాటు దళ కమాండర్ అహ్మద్ అల్ షరా మొదటిసారి జాతి నుద్దేశించి టెలివిజన్‌లో ప్రసంగిస్తూ, ప్రభుత్వ సంస్థలు వేటితోను మిలిటరీ అప్రోచ్ కాకూడదని హుకుం జారీ చేశారు. అధికారికంగా అధికార మార్పిడి జరిగేంత వరకు మాజీ ప్రధాని మహ్మద్ అల్ జలాలీ ఆధ్వర్యంలోనే పరిపాలన ఉంటుందని చెప్పారు. అయిదు దశాబ్దాల బాత్ పార్టీ నిరంకుశ పాలనకు నేటితో తెర పడింద న్నారు.

# తెలంగాణ తల్లికి ఘన నీరాజనం

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ నమూనా చిత్రాన్ని రద్దీ ఎక్కువగా ఉండే మెట్రో స్టేషన్లలో ప్రదర్శించింది. 'జయ జయహే తెలంగాణ-జననీ జయకేతనం' అంటూ తెలంగాణ స్ఫూర్తిని అంది పుచ్చుకుంటూ మొత్తం 25 మెట్రో స్టేషన్లలో కొత్తగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' చిత్రాలను ఏర్పాటు చేసినట్టు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను హైదరాబాద్ మెట్రో స్టేషన్ల పరిధిలో జోరుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మెట్రో రైల్ రెండవ దశ ముఖ్య అంశాలను తెలియజేసేలా స్టేషన్ల కాన్‌కోర్స్, ప్లాట్‌ఫామ్‌లపైన స్టాండ్‌లను ఏర్పాటు చేశామని, ప్రధాన మార్గాల్లో మెట్రో పిల్లర్లకు హోర్డింగ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సంవత్సరం కాలంలో ప్రభుత్వ విజయాలను, మెట్రో సాధిస్తున్న ప్రగతిని వివరించామని వెల్లడించారు. అందమైన విద్యుద్దీపాల అలంకరణతో ముఖ్యమైన మెట్రో మార్గాలు ప్రజలను విశేషంగా అలరిస్తున్నాయి. కాంగ్రెస్ ఏడాది పాలన విజయాలను ఘనంగా ప్రతిబింబించేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, నేను సైతం అంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటోంది.

# ఏడాది పాలనంతా ఎడతెగని వంచనే

(మొదటి తరువాయి)

విమర్శించారు. ఈ కాలంలో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైందనీ, భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లిందని వాపోయారు. నిరసన తెలిపే హక్కే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు 'కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన చార్జిషీట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ%ొ% రేవంత్ సర్కార్ లోపాలను ఎండగట్టారు. ఆరు గ్యారెంటీల అమల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేశారు. ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్య పాలనను అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్%ొ% నిరంకుశత్వాన్ని మిగిల్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరగని నిర్బంధకాండను రుచి చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూళ్లు, హాస్టళ్ల ముందు పికెట్లు, ముఖ్యమంత్రి సొంతూరుకు వెళ్లేందుకు కూడా పోలీసుల అనుమతి, మీడియా, సోషల్ మీడియాపై ఆంక్షలు, రాజకీయ కక్షతో తప్పుడు కేసు బనాయింపు, లైబ్రరీల్లో సైతం లాఠీఛార్జీలు, అశోక్ నగర్‌ను శోకసంద్రంగా మార్చిన వైనాన్ని ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. బుల్డోజర్లతో ఇండ్లను కూల్చి పేదల జీవితాలను ఛిద్రం చేశారని వాపోయారు. లగచర్ల లంబాడీల మీద థర్డ్ డిగ్రీని ప్రయోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన పాలనంతా ప్రతిపక్షాలకు తిట్లు, ప్రజలను కొట్టుడు, దేవుళ్ల మీద ఒట్లు, తనకు, తన వారికి దోపిడీ సొమ్ము నోట్లంటూ ఎద్దేవా చేశారు. ప్రతీరోజూ ప్రజా దర్బార్ హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్%ొ% దాన్ని ఒక్క రోజు బాగోతంగా మార్చారని సెటైర్లు విసిరారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామనే హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. కేసీఆర్ మార్క్ పాలన దేశానికి దిక్సూచి అయితే, రేవంత్ మార్క్ పాలన దేశం ముందు నవ్వుల పాలైందని దుయ్యబట్టారు. ఎయిర్ పోర్టు రద్దు, ఫార్మాసిటీ రద్దంటూ అనాలోచిత ప్రకటనలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని విమర్శించారు.

# రైతులపై మళ్లీ జులుం

(మొదటి తరువాయి)

కార్యాచరణను సోమవారం నిర్ణయిస్తామని నేతలు తెలిపారు. 101 మందితో కూడిన బృందం ఆదివారం కాలినడకన సాగింది. అనుమతి లేని కారణంగా అక్రమ పాదయాత్ర చేయలేరని పోలీసులు మైక్ లో తెలిపారు. 'మీరు రైతులని రుజువు ఉందా?' అంటూ ప్రశ్నించడం వాగ్వాదానికి దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిపై టియర్‌గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. రైతుల కండ్లు మండుతుంటే.. సహచర రైతులు అండగా నిలిచారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అదే కొనసాగడంతో పాదయాత్రను నిలిపివేశారు. పది మంది గాయపడ్డారనీ, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పాండర్ తెలిపారు. సమస్యను కేంద్రం పరిష్కరించే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు.కాగా, ఖనోరీ సరిహద్దులో రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించి ఆదివారం నాటికి 13 రోజులు పూర్తయింది. రైతులు సమ్మె తీవ్రతరం చేయడంతో ఖనోరి, శంభు ప్రాంతాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శంభులో నిషేధ ఉత్తర్వులు ప్రకటించారు. ఆ ప్రాంతంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిషేధించారు. ఢిల్లీ సరిహద్దుల్లో కూడా భద్రతను పెంచారు. రైతుల డిమాండ్లలో రుణ మాఫీ, మద్దతు ధరలకు చట్టపరమైన రక్షణ వంటివి ఉన్నాయి.

## రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీ గా నియమితులైన కొందుర్గు మండల యువనాయకుడు నరేందర్



కొందుర్గ్,డిసెంబర్ 08(నీలగిరి ఎక్స్‌ప్రెస్): రంగారెడ్డి జిల్లా,కొందుర్గ్ మండలం నికి చెందిన నరేందర్ గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు యూత్ కాంగ్రెస్ పార్టీలో పనిచేసినందుకు అతనికి ప్రతిఫలం దక్కింది.యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీగా నియమితులైన నరేందర్.ఈ సందర్భంగా తన గెలుపు పనిచేసిన యువకులందరికీ సహకరించిన నాయకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొని పార్టీ మరింత బలపడేలా కృషిచేస్తానని యువతకు అండగా ఉంటాననీ తన మాటల్లో తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

– నారోజు కుమారస్వామి చారి



రంగారెడ్డి జిల్లా డిసెంబర్ 08 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) మహేశ్వరం నియోజకవర్గం బడంపేట్ మున్సిపల్ పరిధిలోని అల్మాస్ గూడాలో శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ అంకిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నారోజు కుమారస్వామి చారి మాట్లాడుతూ... అందరూ బాగుండాలనే ఉద్దేశంతో హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు, అలాగే సంఘం సభ్యుల కోసం అడగగానే హెల్త్ క్యాంపు ఏర్పాటుకు సహకరించిన అంకిత స్వచ్ఛంద సంస్థ రంగారెడ్డి కో ఆర్డినేటర్ కొల్లోజు బ్రహ్మం మరియు వారి సిబ్బందికి నారోజు కుమారస్వామి చారి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి బండోజు రవిచారి ప్రధాన కార్యదర్శి బండికట్ల వెంకటేశ్వర్లు మీడియా ఇన్చార్జ్ కుందనం రవి మరియు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రావుల సాయిరాం గౌడ్ జన్మదిన వేడుకలు



కడ్తాల్, డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) కడ్తాల్ మండల్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రావుల సాయిరాం గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్ గౌడ్, అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దళపతి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్ రెడ్డి, క్యామా రాజేష్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మొహ్మద్ ఇమ్రాన్ బాబా, షాబుద్దీన్, కల్వకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీస బాలరాజు, కడ్తాల్ మండల ప్రెసిడెంట్ బాస్ రవి, యువజన కాంగ్రెస్ వెల్దండ మండల ఉపాధ్యక్షులు మహేష్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు జంగయ్య గౌడ్, శ్రీహరి, నాయకులు కురుమూర్తి, మల్లేష్ గౌడ్, శివ, ధర్మ, రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు ఫూలే గురుకులాల పై మంత్రి పొన్నం సమీక్ష



హైదరాబాద్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ప్రెస్) మహాత్మా జ్యోతిరావు ఫూలే గురుకులాల పై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఏంజెపి గురుకుల సెక్రటరీ సైదులు, ఆర్సీవోలు, డిసిఓలు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించబడ్డాయి. పరిసరాల పరిశుభ్రత మరియు ఆహారంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఏదైనా స్కూల్లో సమస్యలు ఉంటే వెంటనే సెక్రటరీకి తెలియజేసి, సెక్రటరీ ద్వారా ప్రభుత్వానికి ఆ సమస్యలను చెప్పి పరిష్కరించడానికి ప్రతి ప్రిన్సిపల్ కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే సొంత భవనాలు ఉన్న 21 గురుకుల పాఠశాలలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగింది. 4 సొసైటీ కార్యదర్శులతో కలిసి మెనోచార్టు ఫైనల్ చేసి, ఆ మెనూలో మార్పులకు అనుగుణంగా విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, సరికొత్త మెనూను అతి త్వరలో విద్యార్థులకు అందించే ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, వారికి అవసరమైన పోషక ఆహారాన్ని అందించడంపై శ్రద్ధ వహించాలని, విద్యార్థులలో ఎవరికైనా అనారోగ్యం ఉంటే వెంటనే వారికి చికిత్స అందించాలని సూచించారు. కల్చరల్ ఆక్టివిటీస్ కి పిల్లలలోని కోకరికులం ఆక్టివిటీస్ కి వారిలోని సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. విద్యా, ఆహారం నాణ్యత ప్రమాణాల కోసం మహాత్మా జ్యోతిబాఫూలే లో టాస్క్ ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మెరిట్ గల విద్యార్థులను అభినందించి, వారికి కావలసిన ప్రత్యేక అవసరాలు ఏమైనా ఉన్నా కానీ ఆర్సీవోలు దృష్టికి తీసుకువచ్చి, వారిద్వారా సెక్రటరీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రానున్న పబ్లిక్ ఎగ్జామ్స్ లో విద్యార్థులు మంచి రిజల్ట్స్ సాధించేలా ప్లాన్ అఫ్ యాక్షన్ రెడీ చేయాలని, వచ్చే పదవ తరగతి పరీక్షలలో ఎంజెపి విద్యార్థులు మంచి రిజల్ట్స్ సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నిర్ణయించారు. ఎవరైనా స్లో లెర్నర్స్ ఉంటే వారిని గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి లో విద్య నైపుణ్యాలను పెంచడానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు మంచి ఆహారం, వసతి సదుపాయాలు కల్పిస్తూ, పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలన వైఫల్యాల పై ఆచారి ఫైర్





-నియోజకవర్గానికి ఎమ్మెల్యే కసిరెడ్డి ఏం చేశారని ప్రశ్నించిన ఆచారి

-ఏడాది కాలంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

కల్వకుర్తి,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తూ, బీజేపీ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ, పబ్లిక్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ నేత, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి నేతృత్వం వహించారు.భారీ జన సమీకరణతో ఈ సమావేశం జరిగింది. సభలో, బీజేపీ నాయకులు ఆచారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 6 గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేశారనే ఆరోపణలతో టార్గెట్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్' 6 గ్యారంటీలను బీజేపీ నాయకులు ప్రస్తుతించారు. వాటిని అమలు చేయడంలో విఫలమైనట్లు ఆరోపించారు. ఎన్నికల హామీల పేరుతో ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేశారని



ఆరోపణ. డిండి ప్రాజెక్ట్‌కు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులు జరగలేదు. గోకారం చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కె.ఎల్.ఐ ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంతో వ్యవసాయ భూములు నీటిలేక అల్లాడుతున్నాయి. యెల్లికట్ట నుండి కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ రోడ్ల మరమ్మతులు జరగలేదు. మండలాల పలు ప్రాంతాల్లో రోడ్ల పనులు ఆగిపోయాయి. ఆమనగల్‌లో ఆర్డీవో, ఆర్టీఓ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుపై ప్రగతి లేదు, జూనియర్ కాలేజీ, మినీ ట్యాంక్ బండ్, మార్కెట్ యార్డులో గోదాములు ఇంకా పూర్తి కాలేదు. ఇర్విన్, వెల్జాల, గట్టు ఇప్పలపల్లి, రఘుపతిపేట గ్రామాలను మండలాలుగా చేయలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు లేవు. పేదల కోసం వాగ్దానం చేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాజెక్టులు అమలు కాలేదు. కల్వకుర్తిలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం మొదలుకాలేదు. నర్సంపల్లి-కొత్తపల్లి మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణం పెండింగ్‌లో ఉంది. పలు గ్రామాలను కలిపే రహదారుల నిర్మాణం ఆగిపోయింది. ఎమ్మెల్యే కసిరెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ నేతలు ప్రజల ముందు ఉంచారు. ప్రస్తుత ఎమ్మెల్యే అసమర్థత వల్లనే ఈ పరిస్థితులు చోటు చేసుకున్నాయని బీజేపీ విమర్శించింది. కాంగ్రెస్ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పోరాటంలో భాగస్వాములు కావాలని ప్రజలను ఆహ్వానించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రాధాన్యతలను పట్టించుకోలేదని, హామీలను అమలు చేయలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజల ఆవశ్యకతలను గౌరవించే పాలనకు మద్దతు ఇవ్వాలని" తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. బీజేపీ చేపట్టిన ఈ ర్యాలీ కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకతను వ్యక్తం చేయడానికి మంచంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనపై ప్రజల నమ్మకాన్ని తిరిగి పొందడానికి, విమర్శలపై సమాధానం చెప్పడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# మద్యం సేవించవా.. కటకటలే పాలే : ఎస్ఐ సురేష్

నర్సింహులపేట డిసెంబర్ 8 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాలోతు సురేష్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న కొంతమంది పై కేసు నమోదు చేసారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం మత్తులో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే తమ కుటుంబసభ్యుల పరిస్థితి ఏమిటనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్. ప్రవీణ్. సింగ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు



# కల్వకుర్తిలో బిజెపి ర్యాలీపై యువజన కాంగ్రెస్ నాయకుల విమర్శలు



**కల్వకుర్తి, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్ప్రెస్)**
కల్వకుర్తిలో బిజెపి ర్యాలీ సందర్భంగా, యువజన కాంగ్రెస్ నాయకులు బిజెపి ప్రభుత్వ హామీలను ప్రశ్నించారు. యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, "ఆచారి మోదీకా గ్యారంటీ ఏమైందో ప్రజలకి చెప్పండి. గడిచిన 10 ఏళ్ళ కేంద్ర బిజెపి ప్రభుత్వ హామీలు ఎన్ని నెరవేర్చారో చెప్పండి" అని ప్రశ్నించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, "ఏం మొహం పెట్టుకొని బిజెపి నాయకులు ర్యాలీలు చేస్తున్నారని ప్రశ్నించారు. 2014 నుంచి నేటి వరకు కేంద్ర బిజెపి సర్కార్ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగంగా రైతు రుణమాఫీ చేసిందని, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందిస్తుందని, 500 కే సిలిండర్ను ఇస్తుందని, ఆరోగ్యశ్రీని 10 లక్షల వరకు పెంచడం జరిగిందని, వరి రైతులకు 500 బోనస్ ఇస్తుందని, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ వారికి 48 గంటల్లోనే డబ్బులు వేస్తుందని, మహిళలకి ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తుందని, త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ళను అందిస్తుందని తెలిపారు. రాష్ట్రం పీకల్లోతు అప్పుల్లో ఉన్నా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను ఒక్కొక్కటిగా అమలుపరిచే దిశగా పనిచేస్తుందని తెలిపారు. కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకి అందిస్తుందని, రేవంత్ రెడ్డి నాయకత్వం పై ప్రజలకు పూర్తిస్థాయిలో నమ్మకం ఉందని తెలిపారు. నేడు జరిగినటువంటి బిజెపి ర్యాలీలో బిజెపి నాయకులు ఆచారి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, "ఏ పని పాట లేకుండా ఆడవారు ఎర్ర బస్సులో ఎక్కి పట్నం తిరుగుతున్నారని" మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడడం జరిగిందని, తక్షణమే మహిళ లోకానికి ఆచారి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్ గౌడ్, తాలూకా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దళపతి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్ రెడ్డి, కల్వకుర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీస బాలరాజు, యువజన కాంగ్రెస్ తాలూకా ఉపాధ్యక్షులు ఇమ్రాన్ బాబా, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, యువజన కాంగ్రెస్ వెల్దండ మండల ఉపాధ్యక్షులు మహేష్ నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు జంగయ్య గౌడ్, శ్రీహరి, కడ్తాల్ మండల ఉపాధ్యక్షులు సాయి, నాయకులు కురుమూర్తి, మల్లేష్ గౌడ్, శివ, ధర్మ, రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మా దళం గళంమే మాబలం

**- బి ఆర్ ఎస్ వి వనపర్తి జిల్లా అధ్యక్షుడు హేమంత్**



**వనపర్తి,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్): :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని గురుకుల హాస్టల్లో తనిఖీ బాటా కార్యక్రమంలో బయటపడిన లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేయడానికి మా దళం మా గళం మా బలం వల్ల మాత్రమే సాధ్యమవుతుందని సాధ్యమవుతుందని బి ఆర్ ఎస్ వి విద్యార్థి నాయకులు ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నారు. గత వారం రోజులుగా గురుకుల బాటకు సంబంధించి బిఆర్ఎస్వి వనపర్తి జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్, కార్యక్రమ నిర్వాహక అధ్యక్షుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో వనపర్తిజిల్లా లో ఉన్న అన్ని ఎస్సీ ఎస్టీ బీసీ గురుకులాలు కేజీబీవీ, మహాత్మ జ్యోతి రావుపూలే పాఠశాలలను సందర్శించి అక్కడున్నటువంటి ఆహార నాణ్యత లోపాలను దాన్యాగారాలను,కూరగాయలన్నింటినీ పరిశీలించి వాటి అవకతవకలను ఒక నివేదికగా తయారుచేసి దానిపై కఠిన చర్యలు తీసుకుని ఈ నివేదికను అధికారులదృష్టికి తెచ్చి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగాను రానున్న రోజుల్లో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యాన్ని ఎండగడుతా మని వారన్నారు, బిఆర్ఎస్వి ఒకదళంగా గళంవిప్పి బలంగా మారి స్థానిక ఎమ్మెల్యేలను రాష్ట్ర మంత్రులను ఎక్కడ తిరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తామనివారన్నారు. హాస్టల్లో ఇంత అద్వాన్నంగా ఉండడానికి 100% కాంగ్రెస్ ప్రభుత్వ మే విఫలంఅని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి గురుకుల బాట వనపర్తి ఇంచార్జ్ శివ ప్రసాద్, బి ఆర్ ఎస్ వి రాష్ట్రనాయకులు శ్రవణ్ కుమార్ ,మైనారిటీ నాయకులు ముద్దసీర్, అబ్దుల్ అలీమ్ సంచాలకులు అమరేందర్ , లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్,అఖిలేందర్ ,నాగరాజు ,మన్సూర్ ,మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలకు అవగాహన సదస్సు





**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 08 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
యాచారం మండల కేంద్రంలో ఇటీవల గ్రామాలలో ఎన్నుకున్న ఇందిరమ్మ కమిటీల సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ , ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అద్యక్షులు,ఇందిరమ్మ కమిటి సభ్యులు నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ డైరెక్టర్, పార్టి మండల అధ్యక్షులు మస్కు నరసింహ మాట్లాడుతూ...రేపటి నుంచి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల కోసం గ్రామ పంచాయితీ అధికారులు వెళ్లే సమయంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు, గ్రామశాఖ అద్యక్షులు కలిసి దగ్గరుండి చూసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందెల చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, ఎస్సి సేల్ మండల అధ్యక్షులు చిన్నోళ్ళ మల్లేశ్, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి నీలం వెంకటేష్,మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు ,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

**– ఏసీపీ రాజు**



**ఇబ్రహీంపట్నం డిసెంబర్ 08 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
సమాజంలో ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయం పరిధిలో సిఐలతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పచ్చదనాన్ని పర్యావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఇప్పుడు మనం నాటే మొక్కలు రాబోయే తరాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ను తీసుకోవాలన్నారు . మానవ మనుగడ మొక్కలతోనే సాధ్యమన్నారు . నాటిన మొక్కలను సంరక్షించి వృక్షాలుగా మలచాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల వారి వివాహ విందు వేడుకల్లో అనీల్ నాయక్



**తలకొండపల్లి, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, తలకొండపల్లి మాజీ జెడ్పీటిసి ఉప్పల వేంకటేశ్ చిన్న కుమారుడు ఉప్పల అనిల్ వివాహ విందు వేడుకలు తలకొండపల్లి ఎక్స్ రోడ్డులో కల్వకుర్తి నియోజకవర్గ అశేష జనసమూహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుబ్య తండా యువ నాయకుడు నేనావత్ అనీల్ నాయక్, దేవరాజ్ బావజీ, కుబ్య తండా గ్రామపంచాయతీ నుండి మరి కొంతమంది యువకులు పాల్గొన్నారు.

# దేవాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

**పోలీసుల పిలుపుతో స్పందించిన చెర్క శివ కుమార్**



**షాద్ నగర్,డిసెంబర్ 08(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షాద్ నగర్ పట్టణంలో హిందూ దేవాలయాలలో విగ్రహాల ధ్వంసం విషయంలో దాతలు ముందుకు వచ్చి దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాద్ నగర్ పోలీసులు పిలుపునిచ్చారు. ఇందుకు స్పందించిన బీఆర్ఎస్ యువ నాయకులు చెర్క శివ కుమార్ 10వ వార్డులోని సత్యదేవ కాలనీలో గల సత్యనారాయణ స్వామి ఆలయంలో సొంత ఖర్చులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ పిలుపు మేరకు వెంటనే స్పందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన చెర్క శివ కుమార్ ను పట్టణ సిఐ విజయ్ కుమార్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కొందూటి నరేందర్,పిల్లి శేఖర్, సవాళ్ళ వినోద్,పల్లాటి హరీష్, కాలనీ వాసులు రాజశేఖర్ రెడ్డి, ప్రశాంత్, శ్రీకర్, పిల్లి సాయి, రఘు, విజయ్, సాయి, రఘు, మణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీమియర్ లీగ్ ను ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**చౌదరిగూడ,డిసెంబర్ 08(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చౌదరిగూడ మండలం కేంద్రంలో 5 వ సీజన్ చౌదరిగూడ ప్రీమియర్ లీగ్ ను ప్రారంభించారు. ఈ కార్ర్యమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం అయ్యిందని, ప్రణాళిక బద్దంగా అభివృద్ధి జరగలేదు అని పేర్కొన్నారు. కానీ నేడు ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నాను అని తెలిపారు. అతి త్వరలో అన్ని కార్యాలయాలు నిర్మించి మండల వాసుల కష్టాలను తీరుస్తాను అని తెలిపారు. ఉమ్మడి కొందుర్గ్ మండలంను నియోజకవర్గంలో ఒక గొప్ప, అభివృద్ధి చెందిన మండలాలు గా తీర్చిదిద్దుతాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, కొందుర్గ్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీ.ఏ.సి.ఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తనయుడు ఆంజనేయులు, బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ ఇజాజ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్ర బాబు, మాజీ సర్పంచులు బాలరాజు, సలీం, నాయకులు ఖదీర్, పాపయ్య,గోపాల్, శివ, గోపాల్ రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తో సమావేశమైన ఎస్ హెచ్ ఓ లు

**రంగారెడ్డి జిల్లా, డిసెంబర్ 8:(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం ఏసీపీ పరిధి స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ ఆదివారం ఏసీపీ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ పరిధిలోని పాలు అంశాలపై చర్చించారు. ఇటీవలి కాలంలో ఏసీపీ పరిధిలో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే పోలీస్ స్టేషన్ కు వచ్చే వారికి పోలీసు శాఖ భద్రత కల్పించాలని. పోలీస్ స్టేషన్ కు వెళ్ళితే న్యాయం జరుగుతుందని ప్రజలకు భరోసా కల్పించాలని ఏసీపీ రాజు ఎస్ హెచ్ ఓ లకు సూచించారు. ఈ సమావేశంలో ఇబ్రహీం పట్నం ఏసీపీ పరిధిలోని యాచారం, మంచాల,ఆదిభట్ల, ఇబ్రహీం పట్నం పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లు రాఘవేందర్ రెడ్డి, మధు ,సత్యనారాయణ, నర్సింహారావు లు పాల్గొన్నారు.


## ఉప్పల రిసెప్షన్ వేడుకలకు తరలి వెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు, నాయకులు



కద్తాల్,డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ కుమారుడు డాక్టర్ అనిల్ కుమార్ భావన నల రిసెప్షన్ (విందు) కార్యక్రమాన్ని తలకొండపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా ఉప్పల వెంకటేష్ అందించిన చీరలను మహిళలకు అందజేసి రిసెప్షన్ కు ఆహ్వానించారు. అదేవిధంగా కద్తాల మండలం నుంచి భారీ వాహనాలలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు మాజీ ప్రజా ప్రతినిధులు సుమారు 3000 మందికి పైగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నూతన వధూవరులను బిఆర్ఎస్ నాయకులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు, కద్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గంప శ్రీనివాసులు, జోగు వీరయ్య, దర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు

## పలు వివాహ శుభకార్యాలలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి





వనపర్తి,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్) :

ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మార్కు ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ మేనకోడలు శరణ్య(గీతాశ్రీ) వివాహం వై.మహేష్ తో నాగవరం సితార గ్రాండ్ లో జరిగింది,ఇట్టి వివాహానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డివధూవరులను ఆశీర్వదించారు.వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం వనపర్తి మాజీ మార్కెట్ చైర్మెన్ లక్ష్మారెడ్డి తమ్ముడి కూతురు వర్శిక కు రాజీవ్ రెడ్డితో వివాహాము పాలమూరు బృందావన్ గార్డెన్స్ లో జరిగింది. ఇట్టి వివాహానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్,రాళ్ళ.కృష్ణయ్య, బాలీశ్వర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కేశవ్ మెమోరియల్ లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహొత్సవం





నారాయణగూడ, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

కేశవ్ మెమోరియల్ లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహొత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రివర్యులు, తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహొత్సవంలో ఎంపీ డీకే అరుణ,మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్ రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వనపర్తి నియోజకవర్గ అభివృద్దే నా లక్ష్యం

### -ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :

వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా గ్రంధాలయము లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవిలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఒక్కరోజే 136 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవంలు చేసినట్లు ఎమ్మెల్యే మెగా రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన దినోత్సవం లో భాగంగా ఆయన వనపర్తి నియోజకవర్గం లో చేసిన పలు అభివృద్ధి పనులను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన అన్ని పనులను ఒక్కొక్కటి నెరవేరుస్తూ వస్తుందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినప్పటికీ ఇచ్చిన మాట కొరకు నిలబడి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిటినీ అమలు చేస్తుందని అన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహములకు 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు, వరి పండించే రైతులకు 500 రూపాయల బోనస్, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రైతులకు ఉచిత కరెంటు, ఉచిత బియ్యం, 10 లక్షల రూపాయల వరకు ఆరోగ్యశ్రీ అమలుపరుస్తున్నామని అన్నారు. వనపర్తి నియోజకవర్గం లో గత సంవత్సరం కాలంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నేడు వనపర్తి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశామని అందులో ప్రధానంగా పట్టణంలో మంచినీటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు చిట్యాల రోడ్డు పాత ట్యాంకు దగ్గర, కర్నూల్ రోడ్ నందు జంగాల గుట్ట దగ్గర మంచినీటి ట్యాంకుల కోసం శంకుస్థాపన చేసినట్లు, ఇవి పూర్తి అయితే వనపర్తి పట్టణంలో మంచినీటికి ఎటువంటి ఇబ్బంది ఉండదనీ అన్నారు. కోటి పది లక్షల రూపాయలతో జిల్లా గ్రంధాలయాములో మొదటి అంతస్తు నిర్మాణం, మూత్రశాలల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలకు ఇందిరా శక్తి భవనం 5 కోట్ల రూపాయలతో నిర్మించనున్నట్లు చెప్పారు. పట్టణంలో పలు వార్డులలో 50 కోట్లతో సిసి రోడ్ల కొరకు శంకుస్థాపన చేసినట్లు ఇవి పూర్తి అయితే పట్టణం మరింత శోభయానయంగా తయారవుతుందన్నారు. రాబోయే కాలంలో వనపర్తి నియోజకవర్గం వనపర్తి జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు పలు ప్రణాళికలు రూపొందించామని అన్నిటినీ నెరవేరుస్తామని అన్నరు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి





### -సిఐ కృష్ణంరాజు



రంగారెడ్డి జిల్లా డిసెంబర్ 08 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే, డయల్-100పై అవగాహన కలిగి ఉండాలని సిఐ కృష్ణంరాజు ప్రజలకు సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు పోలీసుల సాయం పొందాల్సి వస్తే, వెంటనే డయల్-100కు కాల్ చేయాలని చెప్పారు. కందుకూరు మండలం సాయిరెడ్డి గుడ్డలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సిఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సైబర్ నేరాలు , దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు . అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మెయిల్, వాట్సప్‌ల ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్‌ను క్లిక్ చేస్తే, మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలు, రైతు లు భూమిని తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే సమయంలో మోసపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవహగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ సిబ్బంది సాయిరెడ్డి గూడ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## కమీషనర్లను నియమించాలని ఎమ్మెల్సీకవిత కు వినతి



హైదరాబాద్,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్):

హైదరాబాద్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితని బంజారాహిల్స్ లోని ఆమె నివాసంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు చంటి ముదిరాజ్, జాతీయ,రాష్ట్ర కమిటీ సభ్యులు సమాచార హక్కు చట్టం - 2005 కమిషనర్లను నియమించాలని ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 3 ప్రకారం దేశ పౌరులందరూ సమాచారం పొందే హక్కు ఉందన్నారు,రేపు జరిగే శాసనమండలి సమావేశాలలో సమాచార హక్కు చట్టం కమిషనర్లను నియమించాలని ప్రస్తావిస్తానన్నారు. అలాగే అతి తొందరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆర్టిఐ కమిషనర్లను నియమించేందుకు కృషి చేస్తా అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం వివిధ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోగా, 30రోజుల్లోగా ఇవ్వ వలసిన సమాచారాన్ని కొన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ సెక్షన్ 19(1) ప్రకారం మొదటి అప్పీల్ సమాచారం ఇవ్వట్లేదనీ, అలాగే సెక్షన్ 19(3) ప్రకారం రెండవ అప్పీల్ చేస్తే స్టేట్ కమిషన్ ఆఫీస్ లో కమిషనర్లు లేక వేల దరఖాస్తులు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆర్టీఐ కమిషనర్లను నియమించాలని, సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్,రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి,రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి ఎర్రబెల్లి ప్రగతి,గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి వింజమూరి గణేష్,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన ప్రతి ఆడపిల్ల పేరు మీద రూ.10 వేలు డిపాజిట్..

### పథకం కాదు బాధ్యత.. ఆదర్శంగా నిలుస్తోన్న గ్రామం



కరీంనగర్, డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

పుట్టి పెరిగిన ఊరు అందరికీ ప్రత్యేకం. కానీ ఇప్పుడు ఉన్నత చదువులకి, ఉద్యోగాలకి పుట్టిన ఊరిని వదిలి ఎక్కడో బతుకుతున్నాం. అలాంటి వాళ్లను సొంతూరిని గురించి కదిలిస్తే, అటు కళ్లల్లో నీళ్లు, ఇటు మదిలో ఊసుల ఊట ఇట్టే పొంగుతుంది. అందుకే కొన్ని గ్రామాల్లో ఇంకా “నా ఊరే నా బలం, నా బలగం” అని చెప్పేవాళ్లు ఉన్నారు. ఈ కోవలోకి వస్తుంది కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయిపల్లి గ్రామం. ఈ గ్రామం పుట్టిన ప్రతి ఆడపిల్ల పేరు మీద రూ.10 వేలు ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తూ భరోసా కల్పిస్తోంది. ఈ పథకానికి గ్రామానికి చెందిన ఎన్నారై రేండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థాపించిన “మా ఊరి మహాలక్ష్మి” ఫౌండేషన్ ఆధ్వర్యం వహిస్తోంది. 2017లో గ్రామంలో పుట్టిన 10 మంది ఆడపిల్లల పేర్ల మీద ఫౌండేషన్ ద్వారా రూ.5 వేలు ఫిక్స్డ్ డిపాజిట్ చేయడం మొదలైంది. ఇప్పటి వరకు దాదాపు 60 మంది ఆడబిడ్డల పేర్ల మీద ఫిక్స్డ్ డిపాజిట్లు చేశారు. ప్రతి ఏడాది గ్రామస్థులు కలసి పుట్టిన ప్రతి ఆడపిల్లకు పోస్టాఫీసులో ఫిక్స్డ్ డిపాజిట్ చేసేందుకు నిధులను సమకూర్చుతున్నారు. ఈ పథకం కేవలం గ్రామస్థులే కాకుండా తల్లిదండ్రులు కూడా పాలుపంచుకుంటున్నారు. తల్లిదండ్రులు మరో రూ.5 వేలు కలిపి మొత్తం రూ.10 వేలు పుట్టిన పిల్లల పేర్ల మీద డిపాజిట్ చేస్తున్నారు. ఆ డిపాజిట్ పెండ్లి రోజుకు లక్ష ముప్పై వేల రూపాయల వరకు పెరిగి, వివాహ ఖర్చులకు ఉపయోగపడుతుంది. ఈ ఫౌండేషన్ ద్వారా గ్రామస్థులు కేవలం డిపాజిట్లే కాకుండా ప్రతి సంవత్సరం వెయ్యి రూపాయలు పొదుపు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో పుట్టిన ఆడబిడ్డలకు అండగా నిలవడమే కాకుండా ఏదైనా కుటుంబ పెద్ద గల్ఫ్‌లో మరణిస్తే ఆ కుటుంబానికి గ్రామస్థులే అండగా నిలుస్తున్నారు. కొండాయిపల్లి గ్రామం ఈ విధంగా పుట్టిన ప్రతి ఆడపిల్లకు భరోసా కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

# రెవెన్యూ శాఖ పునరుద్ధరణలో భాగమవుతాం

- కొత్త ఆర్వోఆర్ చట్టం అమలుకు శక్తివంచన లేకుండా పని చేస్తాం
- గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- గ్రామానికో రెవెన్యూ అధికారి ఏర్పాటు మంచి పరిణామం
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి
- తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం
- నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక
- ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహశీల్దార్ వరకు రెవెన్యూ ఉద్యోగులకు ప్రాతినిథ్యం.






**హైదరాబాద్,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సంతోషకరమని, ఈ ప్రయత్నంలో రెవెన్యూ ఉద్యోగులుగా అందరం భాగస్వాములం అవుతామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్డీకపూల్‌లోని అశోక హొటల్‌లో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.లచ్చిరెడ్డి హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వం గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను ఎత్తేయడం వల్ల మొత్తం రెవెన్యూ వ్యవస్థనే నిర్వీర్యం అయ్యిందని ఆయన పేర్కొన్నారు. వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థలను తీసేయడం వల్ల గ్రామ స్థాయిలో పోలీసు వ్యవస్థ లేకుండా పోయిందని, ఫలితంగా లగచర్ల వంటి ఘటనలు జరిగే పరిస్థితి వచ్చిందని అన్నారు. మళ్లీ వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం స్వాగతించాల్సిన విషయమని అన్నారు. గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థను పునర్మించాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి లచ్చిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికో రెవెన్యూ అధికారిని ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వ్యవస్థను, అప్పీల్ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆహ్వానించాల్సిన అంశమని పేర్కొన్నారు. కొత్త ఆర్వోఆర్ చట్టం అమలు కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామని అన్నారు.

**-అన్ని స్థాయిల ఉద్యోగులతో టీజీఆర్ఎస్ఏ**

తెలంగాణ ఉద్యమ సమయంలో రెవెన్యూ ఉద్యోగులను భాగం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ)ను ఏర్పాటు చేశామని లచ్చిరెడ్డి తెలిపారు. రెవెన్యూ శాఖలోని ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహశీల్దార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగులకు ఈ సంఘం ప్రాతినిథ్యం వహిస్తుందని ఆయన చెప్పారు. రెవెన్యూ ఉద్యోగులను ఐక్యం చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేసే వేదికగా టీజీఆర్ఎస్ఏ పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సంఘం నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

**రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే టీజీఆర్ఎస్ఏ లక్ష్యం: బాణాల రాంరెడ్డి**

గతంలో విధ్వంసమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు టీజీఆర్ఎస్ఏ నూతన అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో క్షేత్రస్థాయిలో ఉద్యోగుల సంఖ్య తగ్గి, పనిభారం విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించాల్సిన రెవెన్యూ సమస్యలను గత ప్రభుత్వం రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. గ్రామస్థాయి రెవెన్యూ అధికారి లేకపోవడం వల్ల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసే వారు లేరని అన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ప్రజలకు రెవెన్యూ శాఖను చేరువ చేస్తూ కొత్త రెవెన్యూ చట్టం చేస్తున్నదని అన్నారు. ఈ చట్టాన్ని టీజీఆర్ఎస్ఏ స్వాగతిస్తున్నదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీజీఆర్ఎస్ఏ పని చేయనున్నట్టు తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్ నుంచి డిప్యూటీ తహశీల్దార్ వరకు అన్ని స్థాయిల రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం పని చేస్తుందని ఆయన తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ, కోశాధికారి శ్రీనివాస్ శంకర్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

**టీజీఆర్ఎస్ఏ నూతన కమిటీ ఎన్నిక**

టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర నూతన కమిటీని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భిక్షం, కోశాధికారిగా మల్లేశ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుజాత చౌహాన్ ఎన్నికయ్యారు.

# తెలంగాణ సంఘం (టీజీఆర్ఎస్ఏ) నూతన కమిటీ..



బాణాల రాంరెడ్డి, అధ్యక్షుడు
తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్



భిక్షం, ప్రధాన కార్యదర్శి
తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్



సుజాత చౌహాన్, మహిళా అధ్యక్షురాలు
తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్



మల్లేశ్, కోశాధికారి
తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్




**హైదరాబాద్, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ సంఘం (టీజీఆర్ఎస్ఏ) నూతన కమిటీ ఎన్నికైంది. తెలంగాణ ఉద్యోగాల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ సర్వీసుల సంఘం అధ్యక్షుడిగా బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భిక్షం, మహిళా అధ్యక్షురాలిగా సుజాతా చౌహాన్, కోశాధికారిగా మల్లేష్ ఎన్నుకున్నారు .

# ప్రజా పాలనలో తెలంగాణ ప్రగతిని సాధించింది

## - ఎమ్మెల్యే కసిరెడ్డి

**కల్వకుర్తి, డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో సాధించిన ప్రగతిని జీర్ణించుకోలేని విపక్షాలు విష ప్రచారాల ద్వారా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందెందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. పదేళ్లలో బిఆర్ఎస్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ప్రభుత్వం చేరువ చేసిందని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచి దేశంలోని రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్ర భాగాన నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రగతిని అడ్డుకోవడమే టిఆర్ఎస్ నాయకులు దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అభివృద్ధిపై దమ్ముంటే విపక్షాలు చర్చకు అమరవీరుల స్థూపం వద్దకు రావాలని సవాల్ విసిరారు. ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని, టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులతో అధోగతి పాలు చేస్తే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దారిలో పెట్టి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తుందని చెప్పారు. బిజెపి నాయకులు కేంద్రంలోని తమ ప్రభుత్వం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిధులు తీసుకురాకపోగా రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేసి కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా కులగన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దక్కిందని, ప్రభుత్వం తోడ్పాటుతో బహుళ జాతి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రంలో 55వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో, కేంద్ర ప్రభుత్వం ఏటా ఇస్తామన్న రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో బిజెపి నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి చెరువుతో ఉమ్మడి పాలమూరు జిల్లాకు కల్వకుర్తి నియోజకవర్గం సిటీలో ఉపాధి అవకాశాలు మెరుగుపడి నిరుద్యోగులకు మేలు జరుగుతుందని అన్నారు. కేసీఆర్ సర్కారు ప్రజలను వంచించిందని, తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. రోడ్డు విస్తీర్ణకు కేంద్ర ప్రభుత్వం వద్ద హైదరాబాద్ నుండి శ్రీశైలం రహదారి కోసం ప్రతిపాదనలు పెడితే మీనమేషాలు లెక్కిస్తుందని ఆరోపించారు.

# ఎంపీ వద్దిరాజు హై - కమిషనర్ పసుపులేటికి సత్కారం.



**హైదరాబాద్,డిసెంబర్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మనదేశంలో గ్రెనడా హై కమిషనర్ పసుపులేటి గీతా కిషోర్ కుమార్ ను శాలువాతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలికి చెందిన ఆయన హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీ చదివి 45 ఏళ్ల కిందట గ్రెనడా వెళ్లి వ్యాపారాలు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. వ్యాపార, సేవా రంగాలలో గీతా కిషోర్ కృషిని కొనియాడుతూ రెండు చక్రవర్తి చార్లెస్ మెంబర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్ (MBE ) బిరుదుతో గౌరవించారు. గ్రెనడాకు 1974లో స్వాతంత్ర్యం సిద్ధించినా, ఇంకా రాజధాని మోనార్కీ కిందనే కొనసాగుతోంది.ఆయన పుట్టి పెరిగిన ఇండియాకు తమ గ్రెనడా తరపున దౌత్యవేత్తగా పంపడం విశేషం. గీతా కిషోర్ నియమాకం పట్ల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచన చేయడం చాలా అరుదైన సందర్భమని వ్యాఖ్యానించింది. గీతా కిషోర్ తన తెలంగాణ పర్యటన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎంపీ రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పసుపు హైకమిషనర్లేటిని ఎంపీ వద్దిరాజు తన సన్నిహితులు మరికల్ పోత సుధీర్ కుమార్, ఆది విష్ణుమూర్తి, ముద్దు వినోద్, ఆకుల రజిత్ కుమార్, ఊసా రఘు, చెరుకూరి శేషగిరిరావు తదితరులతో కలిసి శాలువాతో సత్కరించారు, కొద్దిసేపు ఇష్టాగోష్టి జరిపారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద హనీ కేక్.. హైదరాబాద్ బేకరీ రికార్డు



**హైదరాబాద్,డిసెంబర్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హైదరాబాద్‌కు చెందిన బేకింగ్ కంపెనీ అరుదైన ఘనత సాధించింది. హార్లీస్ ఇండియా ఫైన్ బేకింగ్ సంస్థ ప్రపంచంలోనే అతి పెద్ద కేక్‌ను తయారుచేసి.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానాన్ని సంపాదించింది. అతిపెద్ద కేక్! కొండాపూర్‌లోని మాయా కన్వెన్షన్ సెంటర్‌లో రష్యన్ మెడోవిక్ హనీ కేక్‌ను రూపొందించింది. వాస్తవానికి 3 టన్నుల కేక్ తయారు చేయాలని భావించినా, చివరకు 2,254 కేజీలను తయారు చేసింది. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధుల ముందే 500 మంది బేకర్లు, చెఫ్‌లు కలిసి ఈ అద్భుతం చేయడం విశేషం. న్యాయనిర్ణేతలుగా ఉన్న రిషి నాథ్, నిఖిల్ శుక్లాలు.. గిన్నిస్ రికార్డు సర్టిఫికేట్‌ను హార్లీస్ ఇండియా అధినేత సురేష్ నాయక్‌కు అందజేశారు. సినీ దర్శకుడు చందు మొండేటి, చిన్ని కృష్ణ, హీరో భరత్ రెడ్డి సహా పలువురు ఈ ఈవెంట్ లో పాల్గొని సురేష్ నాయక్ ను అభినందించారు. 7 అడుగుల వెడల్పు, 70 అడుగుల ఎత్తులో గతంలో ఉన్న రికార్డ్ కంటే దాదాపు 10 రెట్లు మిన్నగా ఈ భారీ కేక్ రూపొందింది.

# ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ నిర్వహణ





**హైదరాబాద్,8 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భక్తితో నిండిన వైభవోపేతమైన అయ్యప్ప స్వామి మహా పడి పూజ హస్తినాపూర్ కాలనీలో శనివారం ఘనంగా నిర్వహించబడింది. బాలాజీ బిల్డింగ్ సంస్థ అధినేతలు బోనగిరి నరసింహ, రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజ కార్యక్రమం ఆధ్యాత్మిక చైతన్యంతో పరవశించిపోయింది. స్వామి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి అయ్యప్ప భక్తులు సంకల్పాలతో ముందుకొచ్చారు. "స్వామియే శరణం అయ్యప్ప" నినాదాలతో పరిసరాలు మార్మోగిపోయాయి. అయ్యప్ప నామ స్మరణతో సాగిన భజనలు భక్తజన హృదయాలను ఆవహించాయి. ఈ వేడుకలో కండె సత్యం, కండె నిశాంక్, కుర్నాల కిరణ్ కుమార్, కృష్ణారావు, అభిషేక్, అయ్యప్ప స్వాములు కిషన్, యాదగిరి రావు, చిన్నా, వెంకట్ రెడ్డి, ఫణిధర్ తదితరులు పాల్గొన్నారు.